# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 70 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 22 జూన్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




గత ప్రభుత్వంలో
## రెవెన్యూ వ్యవస్థ భ్రష్టుపట్టింది
మంత్రి పొంగులేటి
- రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 10,725 రెవెన్యూ సదస్సులు
- మొత్తంగా 8.58 లక్షల దరఖాస్తులు స్వీకరణ
- ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 67 వేల వినతులు

2

22 వేల మంది రైతులకు
## రైతుభరోసా ఎగవేత
- వారికి వెంటనే రైతు భరోసా సాయం అందించాలి
- లేకుంటే 22వేల మందితో ఓఆర్ఆర్ దిగ్బంధిస్తాం
- జిన్నారం రైతు ధర్నాలో హరీష్ రావు హెచ్చరిక




2

బీఆర్ఎస్ ఎమ్మెల్యే
## పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు
- క్వారీ యజమానిని బెదిరించిన కేసులో పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు చేసిన పోలీసులు
- అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తి



2

# ప్రపంచాన్ని ఏకం చేసిన యోగా
### ప్రత్యేక అతిథిగా హాజరై యోగాసనాలు వేసిన ప్రధాని
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక
- యోగాతో ప్రపంచ దేశాలను ఏకం చేసిన భారత్: ప్రధాని మోదీ
- విశాఖ తీరంలో యోగాసానాలు వేసిన లక్షలాది జనం





విశాఖపట్నం, జూన్ 21 (ప్రభాత ఉదయం)

విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. లక్షలాదిగా జనం తరలివచ్చి ఉత్సాహంగా యోగాలో పాల్గొన్నారు. కిలోటర్ల మేర యోగా చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. విశాఖ ఆర్కే బీచ్ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకగా ముగిసింది. లక్షలాది మంది సాగర తీరానికి చేరుకుని యోగాసనాలు వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. ప్రపంచ రికార్డులు నెలకొల్పడమే లక్ష్యంగా యోగా కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా ..మిగతా 2లో

## విశాఖ యోగాంధ్ర సూపర్ హిట్



- యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం
- స్వర్ణాంధ్ర 2047 సాధనలో యోగాకు భాగస్వామ్యం
- ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమం విజయవంతం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2



27న కృష్ణా నదీ
## యాజమాన్య బోర్డు సమావేశం
అమరావతి, జూన్ 21 (ప్రభాత ఉదయం)

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం ఈనెల 27న జరగనుంది. బోర్డులో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఉద్యోగులకు గతంలో ఇచ్చిన ప్రత్యేక ఇన్సెంటివ్‌లకు సంబంధించిన అంశంపై కేఆర్ఎంబీ ప్రత్యేకంగా భేటీ కానుంది. ప్రత్యేక ఇన్సెంటివ్‌లకు సంబంధించిన మొత్తాన్ని వారి నుంచి రికవరీ చేయాలన్న అంశం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు వెళ్లింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ..మిగతా 2లో



## ఎయిరిండియాకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు
ఆ ముగ్గురు అధికారులను తొలగించాలని ఆదేశం!

న్యూఢిల్లీ, జూన్ 21 (ప్రభాత ఉదయం)

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో ఎయిరిండియాకు చెందిన ముగ్గురు అధికారులపై వేటు పడింది. డివిజనల్ ఉపాధ్యక్షుడు సహా ముగ్గురు సీనియర్ అధికారులను తొలగించాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఎయిరిండియాను ఆదేశించింది. సిబ్బంది ..మిగతా 2లో

## అది ఓటర్ల గోప్యతకు భంగం కలిగించడమే
పోలింగ్ సీసీ ఫుటేజీల డిమాండ్‌పై ఈసీ వ్యాఖ్యలు

పోలింగ్ స్టేషన్ల వీడియో ఫుటేజీని షేర్ చేయాలనే డిమాండ్‌పై ఈసీ స్పందన

న్యూఢిల్లీ, జూన్ 21 (ప్రభాత ఉదయం)

పోలింగ్ స్టేషన్ల వెబ్ కాస్టింగ్ ఫుటేజీని బహిరంగపర్చాలన్న డిమాండ్లపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. పోలింగ్ స్టేషన్ల వీడియో ఫుటేజీని షేర్ చేయడం అంటే ఓటర్ల గోప్యత, భద్రతను ఉల్లంఘించడమే అవుతుందని ..మిగతా 2లో





## ఆపరేషన్ సింధు
2

- ఇరాన్ నుంచి ఢిల్లీకి 290 మంది భారతీయులు
- 'భారత్ మాతా కీ జై' నినాదాలతో దద్దరిల్లిన ఎయిర్‌పోర్ట్
- ఇరాన్ నుంచి భారత్‌కు చేరిన ఫస్ట్ ఫ్లైట్
- తర్వాత రానున్న మరో రెండు విమానాలు

# ప్రపంచాన్ని ఏకం చేసిన యోగా

మొదటి పేజీ తరువాయి...

వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రధానికి సీఎం చంద్రబాబు జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ... 'అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యోగా ప్రపంచ దేశాలను ఏకం




చేసిందని, ఆ ఘనత భారత్‌కు దక్కిందన్నారు. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయి. 175



దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. యోగా అనేది మానవతను పెంచే సామూహిక పక్రియ అన్నారు.. గత పదేళ్లలో కోట్ల మంది జీవితాల్లో యోగా వెలుగులు నింపింది. గ్రామగ్రామాల్లో యువకులు యోగాను అనుసరిస్తున్నారు. యోగాకు వయసుతో పనిలేదు.. యోగాకు హద్దులు లేవు' అని మోదీ అన్నారు. 'ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం. ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుంది. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుంది. మనం అన్న భావన మానవత్వాన్ని పెంచుతుంది. ప్రపంచంలో అశాంతి, అస్థిరత పెరుగుతున్నాయి. యోగా వల్ల శాంతి స్థిరత్వం సాధించవచ్చు' అని మోదీ పేర్కొన్నారు. నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో మంత్రి లోకేశ్ పాత్ర కీలకమైందని.. కొత్త కార్యక్రమాల రూపకల్పనలో ఆయన చొరవ ప్రశంసనీయమని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు. 'యోగా కేవలం వ్యాయామం కాదు.. అదొక జీవన విధానం. ఈ ఏడాది విశాఖలో యోగ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం అద్భుతం' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# విశాఖ యోగాంధ్ర సూపర్ హిట్

**విశాఖపట్నం, జూన్ 21 (ప్రభాత ఉదయం)**

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'యోగా దినోత్సవం రోజు విశాఖలో రికార్డు సృష్టించబోతున్నాం. 1.44 లక్షల మంది యోగా శిక్షకులు ఈ కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. శుక్రవారం 22 వేల మంది గిరిజన విద్యార్థులు సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు సాధించారు. రోజూ గంట సేపు యోగా చేస్తే ఎంతో మంచి ఫలితాలు ఉంటాయి. యోగా అంటే కేవలం వ్యాయామం మాత్రమే కాదు. యోగాతో క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతాయి. యోగా దినోత్సవాన్ని 130 దేశాల్లో నిర్వహించుకుంటున్నారు. యోగాను అన్ని క్రీడల్లో భాగం చేయాలి. స్వర్ణాంధ్ర 2047 సాధనలో యోగాకు భాగస్వామ్యం కల్పిస్తాం. యోగాను ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా ప్రధాని మోదీ మార్చారు. వికసిత్ భారత్‌లో భాగంగా రాష్ట్రాన్ని హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీగా మారుద్దాం. ప్రధాని స్ఫూర్తితో ఏపీలో నెల పాటు యోగాంధ్ర నిర్వహించాం. శరీరం, మనసు, ఆత్మ కలయికే యోగా. దీని వల్ల రోగనిరోధక శక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. యోగా ప్రజా ఉద్యమంగా మారింది.. జీవనశైలిలో భాగమైంది. రోజూ గంట పాటు యోగా చేయాలని పిలుపునిస్తున్నా. ఆసియా క్రీడలు, కామన్వెల్త్, ఒలింపిక్స్‌లో యోగాను చేర్చాలి. వన్ ఎర్త్-వన్ హెల్త్ సాధనకు అందరం కృషి చేద్దాం. యోగాంధ్ర కార్యక్రమం ట్రెండ్ సెట్టర్‌గా మారింది. ఇందులో భాగంగా 1.44 లక్షల మందికి శిక్షణ ఇచ్చాం. 1.40 లక్షలకు పైగా ప్రాంతాల్లో 2.17 కోట్ల మంది యోగాలో పాల్గొన్నారు. విశాఖలో నిర్వహించిన యోగాంధ్రలో 3 లక్షల మందికిపైగా పాల్గొన్నారు. యోగాంధ్రలో భాగంగా 1.70 కోట్ల మందికి ధ్రువపత్రాలు జారీ చేశాం' అని చంద్రబాబు తెలిపారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. యోగాంధ్ర సూపర్ హిట్ అని అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించామని తెలిపారు. 3 లక్షల 3వేల మందికి పైగా అనుకున్న సమయానికి వేదిక వద్దకు చేరుకున్నారని.. ఒకేసారి రెండు గిన్నీస్ రికార్డులు సృష్టించటం ఇదే ప్రథమమని అన్నారు. ప్రజా చైతన్యంతోనే ఈ విజయం సాధించామన్నారు. ప్రకృతి కూడా కరుణించిందని చెప్పారు. 20 రోజుల క్రితం వర్షం పడుతుందని చూపించటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని.. వరుణదేవుడు కూడా కరుణించాడన్నారు. అన్ని దేశాలు గుర్తించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) యోగాంధ్రకు విశేష ప్రాచుర్యం కల్పించారని అన్నారు. ఇంత పెద్ద వేడుకను చిన్న ఇబ్బంది కూడా లేకుండా సాంకేతిక సాయంతో విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు.ఒకేసారి రెండు గిన్నీస్ రికార్డులు సృష్టించటం ఇదే ప్రథమమని అన్నారు. ప్రజా చైతన్యంతోనే ఈ విజయం సాధించామన్నారు. ప్రకృతి కూడా కరుణించిందని చెప్పారు. 20 రోజుల క్రితం వర్షం పడుతుందని చూపించటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని.. వరుణదేవుడు కూడా కరుణించాడన్నారు. అన్ని దేశాలు గుర్తించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యోగాంధ్రకు విశేష ప్రాచుర్యం కల్పించారని అన్నారు.

## 22 వేల మంది రైతులకు రైతుభరోసా ఎగవేత

**సంగారెడ్డి, జూన్ 21 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఇవ్వకపోతే ఓఆర్ఆర్‌ను దిగ్బంధం చేస్తామని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 22 వేల మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. 22 వేల మంది రైతు కుటుంబాలతో ఓఆర్ఆర్ పై వంటావార్పు చేసి బంద్ చేస్తామని ప్రకటించారు. శనివారం సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన జిన్నారంలో ఏర్పాటు చేసిన రైతుల మహా ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ఏర్పాటు చేసి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేశారన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరగకుండా భరోసా కలిపించారన్నారు.రైతులు వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేస్తున్నా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు చెల్లించడం లేదన్నారు. కేసీఆర్ రైతులకు ఎకరానికి రూ.10 వేలు రైతు భరోసా డబ్బులు ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఫించన్ నెలకు రూ.2 వేలు ఇవ్వగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చారని.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలలో రైతులకు వ్యవసాయం కోసం 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసిందన్నారు. కరెంట్ కోతలు లేకుండ సరఫరా చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలు ప్రారంభమైన్నాయని ఆరోపించారు. అనుముల రేవంత్‌రెడ్డి కాదు కోతల రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. పటాన్‌చెరు ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు పంటలు సాగు చేసేందుకు అప్పులు చేసుకోనే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల కుటుంబాలు అప్పుల పాలు కావడం జరిగిందన్నారు. రైతు భరోసాను ఎన్నిక భరోసాగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అందరికి ఇస్తామని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగిలో రైతులకు రైతు భరోసా డబ్బులు వేయలేదని, మండలంలో ఒక్క గ్రామంలో ఉన్న రైతులకు వేశారన్నారు . ఓట్లు కోసం రైతు బంధు పథకంలో డబ్బులు వేస్తామని ప్రకటన చేశారని ఆరోపించారు.

## ఆపరేషన్ సింధు

**న్యూఢిల్లీ, జూన్ 21 (ప్రభాత ఉదయం)**

ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో, ఇరాన్‌లో చిక్కుకున్న 290 మంది భారతీయులను 'ఆపరేషన్ సింధు'లో భాగంగా ప్రత్యేక విమానం ద్వారా రాత్రి ఢిల్లీకి తీసుకొచ్చారు. భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కోసం ఇరాన్ తన గగనతల ఆంక్షలను ఎత్తేసింది. దాదాపు 1,000 మంది భారతీయులను తరలించడానికి మూడు విమానాల కోసం ప్రత్యేకంగా ఆ దేశం తన గగనతలాన్ని తెరిచింది. ఆ మూడు విమానాల్లో తొలి ఫ్లైట్ తాజాగా ఢిల్లీకి చేరుకుంది. మరో రెండు విమానాల్లో ఇరాన్ లో చిక్కుకున్న భారతీయులు ఇండియాకు తిరిగి రానున్నారు. విమానం ల్యాండ్ అయ్యే సరికి 'భారత్ మాతా కీ జై', 'హిందూస్తాన్ జిందాబాద్' నినాదాలతో విమానాశ్రయం మారుమోగింది. ఇరాన్ నుంచి వచ్చిన వారిలో విద్యార్థులు, ధార్మిక యాత్రికులు, పర్యాటకులు ఉన్నారు. క్లిష్ట సమయంలో తమను రక్షించిన భారత భారత ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

**ఆపరేషన్ సింధు అద్భుతం!**

"అక్కడ యుద్ధ పరిస్థితి ఉంది. ఎలా బయటపడతామో అని అస్సలు అర్థం కాలేదు. కానీ భారత ప్రభుత్వం చాలా సమర్థంగా మమ్మల్ని తీసుకొచ్చింది. చాలా ధన్యవాదాలు" అని నోయిడా వాసి తజ్కియా ఫాతిమా అన్నారు.

"ఇప్పుడు నేను ఫీలవుతున్న భావాన్ని మాటల్లో చెప్పలేను. ఇరాన్‌లో మమ్మల్ని 5 స్టార్ హోటల్స్‌లో ఉంచారు. భద్రత కల్పించారు. కానీ ఇప్పుడు ఇండియాకు వచ్చాక మనఃశ్శాంతి లభించింది. భారత ప్రభుత్వానికి చాలా ధన్యవాదాలు. ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ఎంబసీ అన్నీ సౌకర్యాలను కల్పించింది" అని ఇలియా బతూల్ చెప్పారు.

# అది ఓటర్ల గోప్యతకు భంగం కలిగించడమే

మొదటి పేజీ తరువాయి...

అభిప్రాయపడింది. ఫుటేజీని విడుదల చేయాలనే డిమాండ్లు ప్రజాస్వామ్య ప్రక్రియను కాపాడేలా, పారదర్శకతను ప్రోత్సహించేలా కనిపిస్తున్నప్పటికీ అవి వాస్తవానికి ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సీసీ టీవీ ఫుటేజీలు బహిరంగపర్చాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈసీ అధికారులు ఈ తరహా వ్యాఖ్యలు చేశారు.

**'అలా చేయడం చట్ట విరుద్ధం'**

పోలింగ్ స్టేషన్లలోని వీడియో ఫుటేజీని బహిరంగపర్చడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, 1951 ప్రకారం, అలాగే గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పూర్తిగా చట్టం విరుద్ధమని ఈసీ అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ ఫుటేజీని షేర్ చేయడం వల్ల ఎవరు ఓటు వేశారో లేదా గైర్హాజరయ్యారో గుర్తించడం సులభతరం అవుతుందని తెలిపారు. అప్పుడూ ఓటు వేసినవారు, వేయనవారు సమాజ వ్యతిరేక శక్తుల నుంచి ఒత్తిడి, వివక్ష, బెదిరింపులకు గురవుతారని అభిప్రాయపడ్డారు.

"ఒక నిర్దిష్ట బూత్ లో ఏదైనా రాజకీయ పార్టీకి తక్కువ ఓట్లు వస్తే, సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ఏ ఓటరు తమకు ఓటు వేశారో? ఏ ఓటరు ఓటు వేయలేదో? సులభంగా గుర్తించవచ్చు. ఆ తర్వాత రాజకీయ పార్టీలు వారిని వేధించవచ్చు. బెదిరింపులకు పాల్పడవచ్చు. కచ్చితంగా చెప్పాలంటే ఈసీ సీసీటీవీ ఫుటేజ్ ను 45 రోజుల పాటు ఉంచుతుంది. సీసీటీవీ ఫుటేజ్‌లు, వెబ్ కాస్టింగ్ ఈసీ అంతర్గత పర్యవేక్షణ యంత్రాంగాలు. ఎన్నికల ప్రక్రియలో చట్టబద్ధంగా తప్పనిసరి కాదు. ఎన్నికల ఫలితంపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ఆ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ కెమెరా రికార్డింగ్‌లు, వెబ్ కాస్టింగ్, వీడియో ఫుటేజీలను తొలగిస్తాం. అయితే, ఇటీవల ఈ రికార్డులను దుర్వినియోగం చేసి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, కథనాలను వ్యాప్తి చేస్తున్నారు. 45 రోజుల్లోపు ఎన్నికల ఫలితంపై పిటిషన్ దాఖలు చేస్తే సీసీటీవీ ఫుటేజ్‌ను తొలగించము. ఓటరు గోప్యత విషయంలో ఎప్పుడూ రాజీపడబోం." ఎఈసీ అధికారులు

**ఎన్నికల వీడియోలు-**
**45 రోజుల తర్వాత తొలగించండి : ఈసీ**

ఎన్నికల సరళికి సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేసి తప్పుడు కథనాలు సృష్టించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది కేంద్ర ఎన్నికల సంఘం. ఎన్నికల ఫలితంపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ఆ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ కెమెరా రికార్డింగ్‌లు, వెబ్ కాస్టింగ్, వీడియో ఫుటేజ్‌లను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించి రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు మే 30న లేఖలు పంపగా ఆ విషయం తాజాగా బయటపడింది. అయితే, ఇటీవల పోలింగ్ స్టేషన్ల వీడియో ఫుటేజీలను దుర్వినియోగం చేసి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, కథనాలను వ్యాప్తి చేస్తున్నట్లు ఎన్నికల సంఘం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులకు ఈసీ పలు ఆదేశాలు జారీ చేసింది.



# యోగాంధ్ర గిన్నిస్ రికార్డు

## విశాఖ తీరంలో లక్షలాదిగా యోగాసనాలు

**విశాఖపట్నం, జూన్ 21 (ప్రభాత ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర-2025' కార్యక్రమం సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం వేదికగా నిర్వహించిన ఈ బృహత్ యోగా ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా పాల్గొనడంతో ఈ కార్యక్రమం ప్రతిష్ట మరింత పెరిగింది. పదేళ్లుగా ప్రపంచ ప్రజలందరూ జరుపుకుంటున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 11వ ఏడాది కార్యక్రమం ఈసారి ఏపీకి ప్రతిష్టాత్మకమైంది. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా విశాఖ వేదికగా యోగాడే జరిగింది. ఈ విశేష కార్యక్రమాన్ని ఏ.పి.ప్రభుత్వం రికార్డు స్థాయిలో నిర్వహించింది. ఈ అపూర్వ కార్యక్రమంలో మూడు లక్షలకు పైగా యోగ సాధకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. విశాఖ నగరంలోని సుందరమైన రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు విస్తరించిన సుదీర్ఘ మార్గంలో లక్షలాది మంది యోగా సాధకులు ఏకకాలంలో వివిధ యోగాసనాలు వేశారు. క్రమశిక్షణతో, సమన్వయంతో సాగిన ఈ యోగా ప్రదర్శన చూపరులను అబ్బురపరిచింది. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ఒకే చోట, ఒకే సమయంలో యోగా చేయడం ద్వారా గతంలో గుజరాత్‌లోని సూరత్‌లో నమోదైన రికార్డును 'యోగాంధ్ర-2025' అధిగమించడం విశేషం.

# గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టుపట్టింది

మొదటి పేజీ తరువాయి...

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని, దానిని ప్రక్షాళన చేసి పారదర్శకమైన పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో శనివారం ఆయన హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 14న 'భూ భారతి' చట్టాన్ని ఆవిష్కరించారని, ఈ చట్టాన్ని దశలవారీగా అమల్లోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మూడు విడతల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు వివరించారు.

మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టగా, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో జూన్ 3 నుంచి 20 వరకు మిగిలిన ప్రాంతాల్లో సదస్సులు విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

ఈ మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, వీటి ద్వారా ప్రజల నుంచి 8.58 లక్షల దరఖాస్తులు అందాయని మంత్రి వెల్లడించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేల దరఖాస్తులు రాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 61 వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48 వేలు, నల్గొండ జిల్లాలో 42 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట

**వరంగల్, జూన్ 21 (ప్రభాత ఉదయం)**

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట లభించింది. పోలీసులు కౌశిక్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించడానికి న్యాయమూర్తి ఎదుట అతనిని హాజరుపర్చగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. క్వారీ యజమానిని బెదిరించిన కేసులో పోలీసులు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ఉదయం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పోలీసులు కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చారు. 41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేశారని కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు జడ్జి ముందు వినిపించారు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయమూర్తి కౌశిక్‌రెడ్డిని రిమాండ్‌కు పంపడానికి తిరస్కరించి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యహరిస్తోంది : బీఆర్ఎస్ నేతల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ ఎంపీ వినోద్ కుమార్ మండిపడ్డారు. కాజీపేట కోర్టు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రిమాండ్‌ను తిరస్కరించిన అనంతరం బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై కౌశిక్‌రెడ్డి పోరాడుతున్నందుకే ఆయనపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్లను మార్చారు : రెండేళ్ల క్రితం నమోదైన కేసులో ఈరోజు అరెస్టు చేసి, కుట్ర పూరితంగా సెక్షన్లను మార్చారని ఆరోపించారు. పోలీసులు పెట్టిన సెక్షన్లు సరైనవి కావని తమ న్యాయవాదులు వాదించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించినా కోర్టులో తమకు న్యాయం జరిగిందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తామందరం ప్రజల్లో ఉండి పోరాడుతామని స్పష్టం చేశారు.

## 27న కృష్ణా నదీ యాజమాన్య బోర్డుసమావేశం

మొదటి పేజీ తరువాయి...

కూడా ఇచ్చింది. ఇందుకు సంబంధించి రెండు రాష్ట్రాలతో చర్చించి ఓ నిర్ణయానికి రావాలన్న ఉద్దేశంతో బోర్డు ఈనెల 27న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. కృష్ణా బోర్డు 20వ ప్రత్యేక సమావేశం హైబ్రిడ్ విధానంలో జరగనుంది. ఈ మేరకు బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపురే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధికారులకు సమాచారం ఇచ్చారు.

## ఎయిరిండియాకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

షెడ్యూలింగ్, రోస్టర్ బాధ్యతల నుంచి ఆ ముగ్గుర్ని తప్పించాలని సూచించింది. వారిపై అంతర్గత క్రమశిక్షణకు సంబంధించి విచారణ జరిపి పది రోజుల్లో నివేదిక సమర్పించాలని డీజీసీఏ సూచించింది. ఆ ముగ్గురు పదేపదే నిబంధనలు ఉల్లంఘించారు! డీజీసీఏ రోస్టరింగ్ బృందంలోని ముగ్గురు ఎయిర్ ఇండియా అధికారులను విధుల నుంచి తొలగించాలని ఎయిర్ ఇండియాను ఆదేశించింది. వారు పదేపదే నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంది.

# యోగా డే లో పాల్గొన్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి




యోగాడే లో పాల్గొని యోగాసనాలు చేస్తున్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, జూన్ 21 (ప్రభాత ఉదయం) : 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యం డివిజన్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్ లో శనివారం యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి అనుభవజ్ఞులైన యోగా గురువుల మార్గదర్శకత్వంలో వేలది మంది యోగాసనాలను ప్రదర్శించారు. ఉట్కటాసనం, తాడాసనం, అర్ధచక్రాసనం, త్రికోణాసనం, వజ్రాసనం, భద్రాసనం, ప్రాణాయామం వంటి ఆసనాలను ప్రదర్శించారు. అదే విధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ యోగాను భారత్ ను ప్రపంచానికి బహుమతిగా అందించారన్నారు . నేడు ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు యోగాను ఆచరిస్తున్నాయని గుర్తు చేశారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు, వ్యక్తి అభివృద్ధికి, ఐక్యతకు యోగాను సోపానంగా ఆమోదించాయి ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు యోగాను ప్రతి ఒక్కరం ఆచరిద్దాం అదే విధంగా అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని సందర్భంగా యోగ గురువులను ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమం లో వందలాది మంది పాల్గొని ఘనంగా ఈ కార్యక్రమమని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరి కి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ , యోగ గురువులు బిందింగి విమలమ్మ, మర్రి విజయ్ కుమార్, మర్రి ఉమారాణి, పీవీ పద్మ లక్ష్మీ, అరువ రాజు,డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ ఆడికి జనార్ధన్ డివిజన్ సీనియర్ నాయకులు రావుల భాస్కర్, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, నవారు మురలీధర్ రెడ్డి, పి సంతు గౌడ్, ఆడికి మహేందర్ , తలారి చిన్న , మన్మోహన్ రెడ్డి, వినయ్ రెడ్డి , రమేష్ రెడ్డి , జగన్ , రమణ , బొమ్మరాజు నరసింహ , సురేందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, శశిధర్ రెడ్డి , పుస్తకాల నందు, శంకర్, రఘు, రవి, వల్లూరు శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి , మహేందర్ రెడ్డి , శ్రీకాంత్ రెడ్డి, కిరణ్ , కురుమూర్తి , లక్ష్మి , జయంతి , కార్యకర్తలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ వరి పరిశోధనా సంస్థ లో జరిగిన యోగా దినోత్సవం లో పాల్గొన్న ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తదితరులు

## రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థలో ప్రపంచ యోగా దినోత్సవం

బుద్వేల్, జూన్ 21 (ప్రభాత ఉదయం) : ప్రపంచ యోగా దినోత్సవం ను పురస్కంచుకోని రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ లో శనివారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ మహేందర్ కుమార్, డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ పద్మావతి, కల్యాణి, మానస, శైలజ తదితరులు పాల్గొన్నారు



ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహం వద్ద ఘనంగా నివాళులు

## విశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ కు ఘనంగా నివాళులు

జనగామ, జూన్ 21 (ప్రభాత ఉదయం):జనగామ జిల్లా విశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దీగోజు. సాంబ చారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 14 వ వర్ధంతి సందర్బంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా సాంబ చారీ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలని తొలిదశ నుండే ఉద్యమాలు చేస్తూ రాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర వహించి తన జీవితాన్నే పనంగా పెట్టి రాష్ట్రం ఏర్పడితే ఎన్నో లాభాలు చేకూరుతాయనే ఉద్దేశంతో మలిదశ ఉద్యమం లో భాగంగా ఎన్నో వ్యూహాలు రచించి రాష్ట్ర సాధనలో ముఖ్య పాత్ర పోషించిన జయశంకర్ ఆశయాలను అమలు పరచాలని అదేవిధంగా అసెంబ్లీ ప్రాంగణంలో జయశంకర్ సార్ పెద్ద కాస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్రా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు దీగోజు నరసింహచారి, సంఘం ఉపాధ్యక్షులు బత్తోజు సిద్దిరాములు, కోశాధికారి సాతెల్లి రాజమౌళి, ప్రచార కార్యదర్శి చెల్లోజు నవీన్, బండ్ల మల్లేశం, మద్దోజు సిద్దయ్య చారి, మైలారం దామోదర్, వీరస్వామి, పడకంటి శ్రీరాములు, ముమ్మాడి గణేష్, కాసోజు సంతోష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, అధికారులు

## ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు నివాళులు

బుద్వేల్, జూన్ 21(ప్రభాత ఉదయం) : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో నిర్వహించిన ఈ వర్ధంతి కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య జయశంకర్ చిత్రపటానికి పూలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రత్యేక తెలంగాణ సాధనకి జయశంకర్ సార్ చేసిన అసమాన సేవల్ని స్మరించుకున్నాడు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి ఈ సీ హెచ్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది కూడా జయశంకర్ సార్ కి నివాళులర్పించారు. జయశంకర్ సార్ అమర్ రహే అని నినదించారు.






సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం రఘునందన్ రావు

## కృత్రిమ మేథ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంతో మానవ రహిత వ్యవసాయమే లక్ష్యం

### ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధునాతన ప్రయోగశాల త్వరలో ప్రారంభం.

బుద్వేల్, జూన్ 21(ప్రభాత ఉదయం) : వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బి ఐ) ఫౌండేషన్ సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం త్వరలో ప్రారంభించనున్న అరిసా (ఏ ఐ, రోబోటిక్స్, ఐ ఓ టి ఫర్ స్మార్ట్ అగ్రికల్చర్) ల్యాబ్ అత్యవసరమైనదని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్ రావు అభిప్రాయపడ్డారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇలాంటి సృజనాత్మకమైన ఆలోచన చేసి కృత్రిమ మేదస్సు తో కూడిన ప్రయోగశాలను నెలకొల్పుతున్నందుకు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు. పి జె టి ఏ యూ లోని సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఆవరణలో ఎస్ బి ఐ సహకారంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రిహబ్ ఏర్పాటు చేయనున్న ఎస్ బి ఐ - అరిసా (ఏ ఐ రోబోటిక్స్ అండ్ ఐ ఓ టి ఫర్ స్మార్ట్ అగ్రికల్చర్) ప్రయోగశాల ప్రీ లాంచ్ కార్యక్రమంలో రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అరిసా ల్యాబ్ లో వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులతో పాటు, ఇతర సాంకేతిక కోర్సులను అభ్యసించే విద్యార్థులని విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. అదే విధంగా విశ్వవిద్యాలయం చేపడుతున్న పరిశోధన, విద్య మరియు విస్తరణ కార్యక్రమాల రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆయన సూచించారు. రానున్న 20 ఏళ్లలో వ్యవసాయం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని తద్వారా ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం రెండు సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని అందులో మొదటిది అతివేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన వచ్చే మార్పు మరియు రెండవది వ్యవసాయ రంగంపై యువత మక్కువ చూపకపోవడం ద్వారా వ్యవసాయ రంగం నుంచి నానాటికి బయటికి రావటం. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తులో వ్యవసాయ రంగం సుస్థిరంగా ఉండాలంటే మానవ రహిత వ్యవసాయమే శరణ్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. దీనికోసం కృత్రిమ మేధస్సుతో కూడిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి రైతాంగానికి అందించినప్పుడే వ్యవసాయ రంగం సుస్థిరంగా ఉంటుందని అన్నారు. వ్యవసాయ రంగంలో విస్తృతంగా డ్రోన్లు, రోబోలను అందుబాటులో అందుబాటులోకి తేవడం, నేలలోని పోషక పదార్థాలను అంచనా వేయటం మరియు వివిధ పంటలలో పోషకాల వినియోగానికి సంబంధించిన యాజమాన్య పద్ధతులను కృత్రిమ మేధస్సుతో కూడిన పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి రైతాంగానికి అందించటం మరియు వివిధ పంటల్లో తరచుగా వచ్చే తెగుళ్లు మరియు కీటకాల యాజమాన్యంలో కృత్రిమ మేధస్సుతో కూడిన యాజమాన్య పద్ధతులను అభివృద్ధి చేసి అందించడమే ఈ నూతన ప్రయోగశాల ప్రధాన లక్ష్యమని ఉపకులపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్బిఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుచెట్టి ఈ ప్రయోగశాల ఏర్పాటుకు సహకారం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అగ్రి హబ్, సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉ ప కులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

# స్కాలర్షిప్ పెంచాలని రిజిస్ట్రేషన్ నిలిపివేసిన పిహెచ్ డి విద్యార్థులు

### ప్లకార్డులతో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద నిరసన తెలిపిన పిజి,పి.హెచ్డి విద్యార్థులు



రాజేంద్రనగర్,జూన్21(ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ముట్టడించారు.దాదాపు రెండు దశాబ్దాలుగా స్కాలర్షిప్ పెంచకుండా విద్యార్థుల మీద అదనపు భారాన్ని వేస్తూ,పెంచుతామని కాలయాపన చేస్తున్నరని విద్యార్థులు మండిపడుతున్నారు. స్కాలర్షిప్ పెంచకుండా,ఫీజులు మాత్రం సంవత్సరానికి 10శాతం పెంచుతూ విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని విద్యార్థులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసారు.నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలని విద్యార్థులకు ఆదేశాలు జారీ చేస్తూ,ఆదేశాలకు అనుగుణంగా,దానికి అవసరమైన ఆర్థిక అవసరాలను మాత్రం తీర్చడం లేదని విద్యార్థులు రిజిస్ట్రేషన్ నిలిపివేసారు. రోజురోజుకీ పెరుగుతున్న జీవన ప్రామాణికల దృష్ట్యా విద్యార్థుల స్కాలర్షిప్ ను కూడా పెంచాలని డిమాండ్ చేసారు.నాణ్యమైన పరిశోధనలకు విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక భారం కలగకుండా వర్సిటీ విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.దీనిలో భాగంగా గత పది రోజుల నుంచి పీహెచ్డీ విద్యార్థులు వారి యొక్క రెండవ సెమిస్టర్ రిజిస్ట్రేషన్ ను నిలిపివేశారు.స్కాలర్షిప్ పెంచకుండా రిజిస్ట్రేషన్ చేసుకోబోమని విద్యార్థులు స్పష్టంగా తెలియజేశారు. వర్సిటీ అధికారులు సత్వర న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పీజీ,పీహెచ్డీ విద్యార్థులందరూ పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




గుర్రాలపై నిలుచుని యోగా చేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు..



యోగా దినోత్సవంలో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

బుద్వేల్, జూన్ 21(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ను శనివారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ లోని యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డీన్ ఆఫ్ అగ్రి ఇంజనీరింగ్ డాక్టర్ రమణారావు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్, విద్యార్థినీ, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. స్వామి వివేకానంద రాక్ మెమోరియల్ సంస్థ నుండి సురేంద్ర, అరుణ్ గౌర్, కిరణ్ యోగాసనాలు, ప్రాణయామం ఉపయోగాల గురించి వివరించి అందరితో ఒక గంటపాటు యోగాభ్యాసం చేయించారు. చివరగా ఉపకులపతి మాట్లాడుతూ యోగా వలన జీవితంలో కలిగే లాభాల గురించి వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులు సంవత్సరం మొత్తం యోగ సాధన చేయాలని సూచించారు. జాతీయ సేవా పథకం మరియు ఎన్ సీ సీ వాలంటీర్లు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్ అందరిని అభినందించారు.

# జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం



కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



డీసీపీ రాజమహేంద్రనాయక్



అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్



ఏసీపీ పండరి చేతన్

**ఆరోగ్యకర జీవితానికి ప్రధాన సూత్రం యోగ**

**శరీరం, మనస్సు కి శక్తినిచ్చేదే యోగ**

**మనస్సును నిశ్శబ్దం చేసే అభ్యాసమే యోగ**

**ప్రతీ ఆసనం ఆరోగ్యాన్ని ఇస్తుంది**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ, జూన్ 21 (ప్రభాత ఉదయం): అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ధర్మకంచ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ చేతన్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని. ఇందుకోసం యోగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని.. యోగ ను ప్రతీ ఒక్కరు అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈరోజు జిల్లా స్థాయిలోనే కాక మండల స్థాయిలో వివిధ ప్రదేశాల్లో పాఠశాలలో, కార్యాలయల్లో కూడా నిర్వహించామన్నారు. నిత్యజీవితంలో ప్రతీ ఒక్కరు విధిగా యోగ ను అలవాటు చేసుకోవాలని.. దానివల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. యోగ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని. యోగ ఆసనాలు చేయడం వల్ల ఒత్తిడి తగ్గి..ఏకాగ్రత, రోగనిరోధక శక్తి కూడా పెంచుతుందన్నారు. అనేక శారీరక,ఆరోగ్య ప్రయోజనాలను అందించే యోగ అందరి జీవితం లో ఒక భాగం కావాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చని, వయస్సు తో సంబంధం లేకుండ ప్రతీ ఒక్కరు.. యోగ కోసం రోజులో కొంత సమయం కేటాయించాలిసిన అవసరం తప్పకుండ ఉందన్నారు ఈ కార్యక్రమం లో వివిధ శాఖలకు చెందిన అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.




## జిల్లా కోర్ట్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం

జనగామ, జూన్ 21 (ప్రభాత ఉదయం): అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ జనగాం, హైకోర్టు, తెలంగాణ స్టేట్ లీగల్ సర్విస్ అథారిటీ ఆదేశానుసారము జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ సి.విక్రమ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యోగ డే ని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి యోగ మాస్టర్ బి సోమయ్య యోగా వలన ఉపయోగాలు, ఆయుష్ ఎలా పెరుగుతుంది ప్రతిరోజు యోగా చేయటం వలన అనారోగ్యాలు రావు హాస్పిటల్ కు, డాక్టర్ దగ్గరికి పోవాల్సిన పరిస్థితి రాదు అని అన్నారు. యోగ వల్ల మైండ్ రిలాక్స్ అవుతుంది. ఈరోజు యోగా చేయటం వలన ఈరోజు అంతా టెన్షన్స్ లేకుండా ఉంటుంది. ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక ఒత్తిడిని తగ్గించుకొని వర్తమాన కాలంలో జీవించగలము అని అన్నారు. ఈరోజు త్రికోణసనము, భద్రాసనము, వజ్రాసరము, భుజంగాసనం, సర్వంగాసనము, హలాసనము ఇలా చాలా రకాల ఆసనాలు గురించి దాని యొక్క ఉపయోగాల గురించి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ,సీనియర్ సివిల్ జడ్జ్ సి.విక్రమ్ తో పాటు సీనియర్ సివిల్ జడ్జ్ ఈ.సుచరిత , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జి.శశి ,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కే.సందీప , సెకండ్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ డి వెంకట్రాం నరసయ్య , బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ , లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం రవీంద్ర , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వాణిశ్రీ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ప్యారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరము జనగాం జిల్లాలోని సబ్ జైల్లో ఇంటర్నేషనల్ యోగ డేని నిర్వహించడం జరిగింది .అక్కడ ఉన్న విచారణలో ఉన్న ఖైదీలు తో మాట్లాడుతూ ఆరోగ్యము మరియు మనసు ప్రశాంతంగా ఉండాలి అంటే యోగా చేయాలి అని అన్నారు .జిల్లా అధికారి సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ సి.విక్రమ్, సీనియర్ సివిల్ జడ్జ్ సుచరిత , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జి.శశి , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కె. సందీప్ జైల్ సూపరెడెంట్ కృష్ణ కాంత్ యోగా చేస్తూ అదే విధంగా విచారణలో ఉన్న ఖైదీలతో కూడా యోగా చేయిస్తూ యోగ వల్ల న ఉపయోగాల ను తెలియజేశారు.



## ఆరోగ్య పరిరక్షణకై యోగా సాధన చేయాలి

**వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్**

వరంగల్ జూన్ 21,( ప్రభాత ఉదయం బ్యూరో): ఆరోగ్య పరిరక్షణకై పోలీసులు నిరంతరం యోగా సాధన చేయాలని, యోగా సాధన తో తమ జీవిత కాలాన్ని పొడిగించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సిబ్బంది విద్యార్థులు ఉత్సాహంతో యోగా సాధన చేశారు.



యోగాసనాలు చేస్తున్న ఎంపీ కడియం కావ్య

## యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**ప్రతి ఒక్కరూ యోగా అలవాటుచేసుకోవాలి**

వరంగల్ జూన్ 21, (ప్రభాత ఉదయం బ్యూరో): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వేయి స్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన యోగా డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ఒక గొప్ప వరమని అన్నారు. హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగ డే లో స్థానిక శాసనసభ్యులు నాయని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. యోగ డే సందర్భంగా నిర్వహించిన యోగ అభ్యాసన కార్యక్రమంలో భాగంగా ఎంపీ డా.కడియం కావ్య యోగ సాధన చేశారు. యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అన్నారు. యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా ద్వారా శరీరంలోని ప్రతి అవయవానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితిలో 177 దేశాల మద్దతు నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలియజేశారు. మారుతున్న జీవన విధానంలో ప్రతి ఒక్కరూ యోగా, ధాన్యం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఆయుష్ డిపార్ట్మెంట్ వారు పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం కోసం యోగాను ప్రోత్సహించాలన్నారు. కొన్ని యోగా సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

**రుద్రేశ్వరుడిని దర్శించుకున్న ఎంపీ డా.కడియం కావ్య**

హనుమకొండలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజలు అనంతరం ఎంపీ డా.కడియం కావ్య కు అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, ఆయుష్ డిపార్ట్మెంట్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మానసిక ప్రశాంతతకు యోగ:

**వరంగల్ జిల్లా కలెక్టర్**

వరంగల్ జూన్ 21, (ప్రభాత ఉదయం బ్యూరో): యోగ మానసిక ప్రశాంతతను కల్పిస్తుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శనివారం ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఖిలా వరంగల్ లో యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు చేశారు .ప్రతి ఒక్కరు రోజు ఉద్యోగ అలవాటు చేసుకుంటే మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు.



## నూతన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి

జనగామ, జూన్ 21 (ప్రభాత ఉదయం): ఎస్సి అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లు, ట్రాన్స్జెండర్ల సాధికారత శాఖల నూతన మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి మంత్రి ఆహ్వానం మేరకు ఆ కార్యక్రమంకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధిలో మానవ హక్కుల పరిరక్షణ, సమానత్వం, సంక్షేమానికి ఈ శాఖలు కీలకమని వారు పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమం మరింత ముందుకు సాగుతుందని ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఒలంపిక్ రన్‌ను విజయవంతం చేయండి

**జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్ రెడ్డి**

జనగామ, జూన్ 21 (ప్రభాత ఉదయం): జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీన ఉదయం 6:30 గంటలకు నెహ్రూ పార్క్ నుండి కలెక్టర్ కార్యాలయం (ఐడిఓసి) వరకు ఒలంపిక్ రన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఒలంపిక్ రన్ కార్యక్రమంలో యువత క్రీడాకారులు క్రీడా అసోసియేషన్ సభ్యులు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాభిమానులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పటిష్టంగా అమలు కావాలి

**వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలి**

**నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి**




వరంగల్ జూన్ 21 ,(ప్రభాత ఉదయం బ్యూరో): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) ఛైర్మన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ)సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతు భరోసా పథకంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కృషి సమ్మాన్ నిధి, కృషి సించయ్ యోజన పథకాలు రైతులకు అందే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో పామాయిల్ సాగుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లాలో ఎక్కువమంది రైతులు సాగు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీ ఎక్కువగా ఉన్న పామాయిల్ సాగులో రైతులను ప్రోత్సహించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ సంఖ్యలో డెలివరీలు పెరిగే విధంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. పీఎంఆర్ఎఫ్ ఎంతమంది తీసుకుంటున్నారనే వివరాలను, క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన వారి వివరాలను, వారికందిస్తున్న వైద్య సేవలు, కోలుకున్న వారి వివరాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అందజేయాలన్నారు. వచ్చే దిశ మీటింగ్ నాటికి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలు, శాఖలకు సంబంధించిన అన్ని వివరాలు ఉండేలా అధికారులు చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన ప్రసూతి సేవలను అందించాలన్నారు. పల్లె, బస్తీ దావఖానాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో మరిన్ని అదనపు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆరోగ్యం అంటే శారీరక, మానసిక పరిస్థితులు బాగుండే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు ఆరోగ్యవంతంగా ఉండేలా, ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిచ్చేలా వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ విద్యా విధానం ప్రకారం స్టూడెంట్ టీచర్ రేషియో ప్రకారం కూడా లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ స్కూల్స్ ప్రారంభించినట్లయితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష అనంతరం దిశ కమిటీ ఛైర్మన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు వచ్చే అవకాశం ఉన్నందువలన వచ్చే దిశ కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పాటు రైల్వే, పర్యాటక, దేవాదాయ, ఆర్కియాలజీ శాఖలు, యూనివర్సిటీ అధికారులు పాల్గొనాలన్నారు. జులై 21న పార్లమెంట్ సమావేశాలు ఉన్నందువలన వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పథకాల ద్వారా ఇప్పటివరకు వచ్చిన నిధులు, ఇంకా రావాల్సిన వాటిపై అధికారులను పూర్తి సమాచారం అడిగి తెలుసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు కేంద్ర మంత్రులను కూడా కలిసే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆయా శాఖలు తమకు సమాచారం ఇచ్చినట్లయితే వాటిని పరిశీలించిన తదుపరి అమలు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. వచ్చే దిశ కమిటీ సమావేశం నాటికి సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాటి స్థితిగతులపై పూర్తిస్థాయి నివేదికలతో పాల్గొనాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఏవేవి ఉన్నాయి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి తులనాత్మక పరిశీలన చేసి వాటి పూర్తిస్థాయి వివరాలతో సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు అన్ని వివరాలతో హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వైస్ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్రెడ్డి ,కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యోగాతో శారీరక,మానసిక ఆరోగ్యం

**యోగ మన సంస్కృతిలో భాగం..**

**ప్రతి ఒక్కరు యోగా చేసి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి**

**అంతర్జాతీయ యోగ దినోత్సవంలో రాజేంద్రనగర్ నియోజక వర్గ**

**ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



రాజేంద్రనగర్,జూన్21(ప్రభాత ఉదయం) యోగ ఆసనాలు మన సంస్కృతిలో భాగమని రాజేంద్రనగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ప్రతి ఒక్కరు యోగా చేసి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి జిహెచ్ఎంసి ప్లేగ్రౌండ్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు.అనుభవజ్ఞులైన యోగా గురువుల మార్గదర్శకత్వంలో వేలాది మంది యోగాసనాలను ప్రదర్శించారు. ఉట్కటాసనం,తాడాసనం, అర్ధచక్రాసనం,త్రికోణాసనం ,వజ్రాసనం, భద్రాసనం,ప్రాణాయామం వంటి ఆసనాలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రధాన మంత్రి నరేంద్రమోడీ యోగాను భారత్ నుంచి ప్రపంచానికి బహుమతిగా అందించారని గుర్తు చేశారు.నేడు ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు యోగాను ఆచరిస్తున్నాయని,ఆరోగ్యానికి,మానసిక ప్రశాంతతకు,వ్యక్తి అభివృద్ధికి,ఐక్యతకు యోగాను సోపానంగా ఆమోదించాయని,ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు యోగాను ప్రతి ఒక్కరం ఆచరిద్దామని అన్నారు.యోగా పురాతన ఆధ్యాత్మిక అభ్యాసం అన్నారు.యోగా చేయడం ద్వారా మనస్సు,శరీరాన్ని ఏకదాటిపై తీసుకు రావచ్చన్నారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి రోజు యోగా,ధ్యానం చేయడం ద్వారా ఆందోళన,ఒత్తిడి తగ్గి శరీరంలో నూతన ఉత్తేజం ఏర్పడుతుందన్నారు.అదే విధంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా యోగ గురువులను ఘనంగా సన్మానించారు.యోగ మన నిత్య జీవితంలో ఒక భాగం అని అన్నారు.ప్రతి ఒక్కరు యోగా చేసి ఆరోగ్యాలను సంరక్షించుకోవాలని అన్నారు.ఆరోగ్య సంరక్షణకు యోగా అవసరమని,ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్,యోగ గురువులు బిందింగి విమలమ్మ, మర్రి విజయ్ కుమార్,మర్రి ఉమారాణి,పీవీ పద్మ లక్ష్మి,అరువ రాజు,డివిజన్ అధ్యక్షులు పాండుయాదవ్,మాజీ డివిజన్ ప్రెసిడెంట్ ఆడికె జనార్ధన్,డివిజన్ సీనియర్ నాయకులు రావుల భాస్కర్,ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,మురళీధర్ రెడ్డి,సంతుగౌడ్,ఆడికె మహేందర్,తలారి చిన్న,మన్మోహన్ రెడ్డి,వినయ్ రెడ్డి,రమేష్ రెడ్డి,జగన్,రమణ,బొమ్మరాజు సురేందర్ రెడ్డి,జనార్ధన్ రెడ్డి,శశిధర్ రెడ్డి,నరసింహ,పుస్తకాల నందు,శంకర్, రఘు,రవి,వల్లూరు శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి,మహేందర్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,కిరణ్, కురుమూర్తి, లక్ష్మి,జయంతి, కార్యకర్తలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామా ఇంద్ర పాల్ రెడ్డి**

**ఘనంగా ఉప్పర్ పల్లి సాయిబాబా దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం..**



సాయిబాబా స్వామికి పూజలు చేస్తున్న ఇంద్ర పాల్ రెడ్డి

రాజేంద్రనగర్,జూన్ 21(ప్రభాత ఉదయం) ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడూామ ఇంద్రపాల్ రెడ్డి తెలిపారు.శనివారం రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్ పల్లిలోని సాయిబాబా ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజామునే పంచామృతాలతో అభిషేకాలు చేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు,అలంకరణ,భజనలు, హెూమాలు,కీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చైర్మన్ సామ ఇంద్రపాల్ రెడ్డి మాట్లాడుతూ...నానాటికి అడుగంటుతున్న హిందూ ధర్మాన్ని పరిరక్షించాలంటే దేవాలయాల పరిరక్షణ ముఖ్యమన్నారు.సొంత నిధులతో సాయిబాబా దేవాలయం నిర్మించామని తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు.ఈమేరకు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని ఆలయం చైర్మన్ సామ ఇంద్రపాల్ రెడ్డి తెలిపారు.ఆలయ వార్షికోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



## కొత్తకోట వాకర్స్ క్లబ్స్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

కొత్తకోట, జూన్ 20(ప్రభాత ఉదయం) నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణం లోని శివ గార్డెన్ ఫంక్షన్ హాల నందు పట్టణం లోని పలు సమూహాలు వాకర్స్ అసోసియేషన్ లు అందరూ కలసి దాదాపు 300 మంది పాల్గొనగా ఘనంగా యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగా గురూజీ మధుసూదన్ ముఖ్య అతిధిగా పాల్గొని యోగ విశిష్టతలను ఉపయోగాలు తెలుపుతూ పాల్గొన వారి చేత పలు రకాల ఆసనాలు వేయించి , ప్రాణాయామము , ధ్యానం చేయించారు.ఈ సందర్భంగా యోగా గురువులు మాట్లాడుతూ... యోగా కేవలం శరీరానికి సంబంధించినది కాదని మనసుకు సంబంధించినది అని మన యొక్క మానసిక వత్తిడుల కారణంగానే మనిషికి రకరకాల జబ్బులు వస్తున్నాయని జబ్బులు ఉన్నాయని శరీరానికి చేసే చికిత్స తాతకలికమైనది మాత్రమే నాని మన మనసును శుద్ధి చేస్తే జబ్బులు పూర్తిగా నశిస్తాయని అది కేవలం యోగా ద్వారానే సాధ్యమని మన ఆహారపు అలవాట్లు మన ఆలోచన విధానము మార్చుకుంటేనే జబ్బులు దరిదాపులకు చేరవని అన్నారు.కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు స్థానిక మునిసిపల్ కమీషనర్ సైదయ్య , గుంద్రాతి వామన్ గౌడ్ , బీసం చెన్నకేషవ రెడ్డి , సంధ్య రవీంధర్ రెడ్డి , ఎం వెంకటేశ్వర రెడ్డి, కొమ్ము భరత్ భూషణ్ , మురళీధర్ రెడ్డి , శ్యామ్ సుందర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు రామ కృష్ణారెడ్డి , పలుస శేఖర్ గౌడ్ , దేవన్న , స్టార్ ఆంజనేయులు , భీమ కిషోర్ , శ్రీనివాస్ రెడ్డి , కిషన్ నాయక్ , హిమ బిందు , కొండ స్వప్న తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు యోగ దినోత్సవంలో పాల్గొన్నవారికి గుబ్బ బాలస్వామి , సురేష్ , భీమ ప్రభాకర్ , భీమ రవి కుమార్ గార్లు ఆరోగ్యకరమైన అమృతాహారం ఏర్పాటు చేశారు






## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**బిజెపి జిల్లా కార్యదర్శి వై శ్రీధర్**

**రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం**

రాజేంద్రనగర్, జూన్ 21(ప్రభాత ఉదయం) యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ అన్నారు. శనివారం రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సందీప్ ఆధ్వర్యంలో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బ్యాడ్మింటన్ అండ్ పికిల్ బాల్ కోర్ట్ ఉప్పర్ పల్లి లో యోగ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు డి సత్యనారాయణ ముదిరాజ్, బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి, బాబురావు, హరి కిషన్ జి, కోరని క్రాంతి,శ్రీకాంత్ రెడ్డి, బాలకృష్ణ,మల్లేష్ చారి, వెంకటేష్, సురేందర్,శ్రీనివాస్ రెడ్డి, పద్మావతి, రాకేష్ గౌడ్,సప్నారెడ్డి, కవిత, యాదగిరి, రమకాంత్, తుంగ ఇంద్రారెడ్డి,సరిత రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాగరాజు , నాయకులు పాల్గొన్నారు



## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి మరువలేనిది

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్**

రాజేంద్రనగర్,జూన్21(ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్ఫూర్తి మరువలేనిదని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ అన్నారు.జయశంకర్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని వ్యాఖ్యానించారు.శనివారం ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి తెలంగాణ సిద్ధాంతకర్తగా,ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్కు నివాళ్ళు అర్పించారు.డివిజన్ నాయకులు, తెలంగాణ సిద్ధాంతకర్తగా,ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని గుర్తు చేశారు.ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిరంతర కృషిని,ఆయన ధృడ సంకల్పాన్ని తెలంగాణ రాష్ట్రం ఎప్పటికీ మరచిపోదని కొనియాడారు.తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిదన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా,ఊపిరిగా ఆయన ముందుకెళ్లడం జరిగిందన్నారు.తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటిన మహాజ్ఞాని,తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని అన్నారు.తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ గుర్తిండిపోయే వ్యక్తి జయశంకర్ అని,ఉద్యమకారుడి నుండి మహోపాధ్యాయుడి దాకా ఆయన తెలంగాణకు దిక్సూచిగా నిలిచారన్నారు.తెలంగాణ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలను తెలంగాణ ప్రజలు,భవిష్యత్ తరాలు గుర్తుంచుకునే విధంగా వారి సంకల్ప బలం రాష్ట్ర సాధనకు చేసిన నిర్విరామ కృషి అంచ లంచలుగా ఆశయ ఆలోచనలకు పదును పెడుతూ,రాష్ట్ర సాధనకు ఆయువుపట్టు అయ్యారని ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులు నోముల రాము యాదవ్,యూత్ అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్,ఎడ్లకాడి సూర్యం,సోమ శ్రీనివాస్ గుప్తా,బండ రాజేష్ యాదవ్ మైసి రెడ్డి,జి రాజు,భాస్కర్,ప్రవీణ్,సరికొండ దుర్గేష్,భూదేవి అరుణ రెడ్డి,చిరంజీవి,చికెన్ రాజు,సునీల్, అశోక్ కుమార్,కార్తీక్,బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కోర్టు ఆర్డర్‌తో స్టే - వ్యాకేట్ అయిపోయింది

**అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి.. జోనల్ కమిషనర్ కు కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి వినతి**

కూకట్‌పల్లి, జూన్ 21 (ప్రభాత ఉదయం) బాలానగర్ కార్పొరేటర్ అక్రమంగా నిర్మించిన భారీ భవనంపై తక్షణమే చర్యలు చేపట్టాలని కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి శనివారం మధ్యాహ్నం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి ఓ.ఎస్. నేం : 97 ఆఫ్ 2024 లోని 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, 13వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ జడ్జి, కూకట్ పల్లి వారి ఆదేశాల్లో పిటిషనర్ దారుడు అయిన ఆవుల రవీందర్ రెడ్డి కూకట్ పల్లి సర్కిల్ అధికారులు ఆకారంగా అడ్డుతగుతున్నారని వేసిన టెంపరరీ ఇంజక్షన్ ను డిస్మిస్ చేసింది. ఇదే కాకుండా గతంలో ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్ ను వ్యాకేట్ చేసినట్లు తెలిపే కోర్టు కాపీని జోనల్ కమిషనర్ కు అందజేస్తూ పూర్తి వివరాలు వివరించారు. తక్షణమే కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమంగా నిర్మించిన భవనానికి వ్యాకేట్ నోటీసు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.





## నేడు గగన్ పహాడ్, శాతం రాయిలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, జూన్ 21(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలోని జైభవని విద్యుత్ ఫీడర్ , శాతంరాయ్ మీనాక్షి పరిధిలో ఆదివారం ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు, శాతంరాయ్ పారిశ్రామిక ఫీడర్ . మీనాకెమికల్ ఫీడర్ పరిధిలో డ్రీమ్ ఇండియా మోనార్చే. గగన్‌పహాడ్ లో మధ్యాహ్నం 9.30. నుండి మధ్యాహ్నం 12.30 వరకు. శాతంరాయ్ గ్రామం విద్యుత్ ఫీడర్ రాత్రి 9.30 నుండి 12. వరకు, గగన్‌పహాడ్ శ్రీధర్ పరిధిలో ఆదివారం సాయంత్రం 9.30 నుండి 12.30 వరకు, మెట్రో మాల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుండి 3.30 వరకు, పిలికాన్ రబ్బరు విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుండి 3. 30 వరకు, శివాజీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.00 గంటల వరకు శివాజినగర్ ఇండస్ట్రియల్ ఏరియా , శ్రీరామ్ కాలనీ జల్ పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుండి 5. 30 గంటల వరకు సరఫరాల అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# యోగాతో ఆరోగ్యకర జీవనం

**యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి..**

**అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్**






రాజేంద్రనగర్,జూన్ 21(ప్రభాత ఉదయం) యోగాతో ఆరోగ్యకర జీవనం సిద్ధిస్తుందని,ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ అన్నారు.యోగా దినోత్సవన్ని పురస్కరించుకొని అత్తాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ పార్కులో యోగా గురుజీ సుధాకర్ ఆధ్వర్యంలో యోగా డేను నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత మాట్లాడుతూ...యోగా జీవితంలో భాగం కావాలని ఆమె ఆకాంక్షించారు.యోగా మన జీవితంలో భాగస్వామ్యం కావాలని చెప్పారు.నేటి యువత ఒత్తిడి నుంచి దూరం కావాలంటే...యోగా దివ్యౌషధం అని సంగీత గౌరీశంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు.ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా మంచి సాధనమన్నారు.నిత్యం యోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, మారుతున్న జీవన విధానంలో యోగ చాలా బాగా ఉపయోగ పడుతుందని వివరించారు.ఆరోగ్యమే మహా భాగ్యమని,ఆరోగ్య సాధనకు యోగా ఒక చక్కని మార్గమన్నారు.రక్తపోటు,మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల నియంత్రణకు యోగా దోహదపడుతుందని చెప్పారు.ప్రజలు అందరూ నిత్యం యోగ సాధన చేయాలని,యోగ చక్కటి మార్గమని యోగ సాధన చేయడం ద్వారా మధు మెహం,రక్త పోటు వ్యాధులను నివారిస్తుందని తెలిపారు.యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని,ఇది వారి మెరుగైన జీవనానికి దోహదం చేస్తుందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి,కొమురయ్య, ప్రభాకర్,కనకయ్య, విజయ్ కుమార్,జయానంద్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ ఆశయాల కోసం ముందుకు సాగాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజ్గిరి, జూన్ 21(ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ విషయాల కోసం ముందుకు సాగాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి దిశానిర్దేశం చేసిన గొప్ప చైతన్యవంతుడు, విద్యావేత్త అని కొనియాడారు.



## ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించడంలో యోగ ఎంతో తోడ్పాటు

### జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 21(ప్రభాత ఉదయం)ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించడంలో యోగ ఎంతో తోడ్పాటునిస్తుందని, నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రలోని స్మృతి వనంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన యోగా ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. భూమిని సాగు చేయడానికి మనం ఎంత శ్రద్ధ తీసుకుంటామో, అలానే మన శరీరం అనే భూమిని ఆరోగ్యంగా ఉంచుకోవడంలో కూడా అంతే శ్రద్ధ అవసరమని తెలిపారు. భూమిని శుద్ధి చేసి విత్తనాలు వేసినప్పుడు మంచి పంట వచ్చినట్లు,మన శరీరాన్ని యోగా ద్వారా శుద్ధి చేసి,మంచినే ఆచరిస్తూ, శుభ ఆలోచనలు పెంపొందిస్తే ఆరోగ్యం అనే అమూల్యమైన ఫలితాన్ని పొందవచ్చని తెలిపారు. ఒక డాక్టర్ వ్యాధి వచ్చిన తరువాత దానికి చికిత్స అందిస్తారని ,కానీ యోగా మాస్టర్ ముందుగానే శరీరం,మనస్సు ఆరోగ్యంగా ఉండేలా మార్గం చూపిస్తారని తెలిపారు. యోగా అనేది కేవలం వ్యాయామం కాదని ,ఇది మన శరీరానికి ఆరోగ్యాన్ని,మనసుకు ప్రశాంతతను ఇచ్చే మార్గమని అన్నారు. అనంతరం ఐడీఓసి కార్యాలయంలో యోగా దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ కార్యాలయ సిబ్బందితో కలిసి యోగా చేశారు. అనంతరం యోగా యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఓ భూపాల్ రెడ్డి, ఈడీ ఎస్సీ రమేష్ బాబు,జిల్లా పరిశ్రమల శాఖ జి.యం రామ లింగేశ్వర్ గౌడ్,జిల్లా వ్యవసాయాధికారి సక్రియా నాయక్,డాక్టర్ మోహన్ రావు, సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్,ఆశా వర్కర్లు,కలెక్టరేట్ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతి సేవా సంస్థ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దివంగత కాంగ్రెస్ నాయకుడు పాండు ముదిరాజ్ వర్ధంతి

### పేద విద్యార్థులకు పాఠ్య, నోటు బుక్కల పంపిణీ

### టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి, జూన్ 21 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ ప్రగతి సేవా సంస్థ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దివంగత కాంగ్రెస్ నాయకుడు పాండు ముదిరాజ్ పదవ వర్ధంతి సందర్భంగా శనివారం ఫతేనగర్ భగత్ సింగ్ పార్కులోని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫతేనగర్ లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్య అందిస్తుంటే ప్రైవేటు పాఠశాలలు రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ సామాన్యులను ఇబ్బందికి గురి చేస్తున్నా కొందరు తల్లిదండ్రులు పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లేందుకు కొందరు బస్సులలోకి వచ్చి ప్రైవేటు పాఠశాలల పంపించాలని ప్రచారం చేస్తున్నారన్నారని తెలిపారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మయ్య, టీపీసీసీ సెక్రటరీ ప్రోటో కాల్ కమిటీ సభ్యుడు సూరజ్ కుమార్ తివారి, కె. రాజు, కె. రమేష్, నార్సింగ్ రావు, చిటకోరు కృష్ణ, మధు, ప్రకాష్ ముదిరాజ్, అస్లాం, శివ చౌదరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి పీ అండ్ ఏ సీజీయంగా సురేష్ బాధ్యతల స్వీకరణ



ఖైరతాబాద్, జూన్ 21(ప్రభాత ఉదయం) జలమండలి పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ వింగ్ సీజీఎంగా ఎం.సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జీఎం(పి అండ్ ఏ)గా పనిచేస్తున్న ఆయన సీజీఎం(పి అండ్ ఏ)గా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఆయన ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డిని ఆయన ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి ఒక్కరు యోగాను నిజ జీవితంలో అలవాటుగా మార్చుకోవాలి



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 21(ప్రభాత ఉదయం)యోగా ద్వారా పని ఒత్తిడి నుండి ఉపశమనం కలగడం తో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఆనందమాయమైన జీవితానికి ప్రతి ఒక్కరు యోగాను నిజ జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీస్ శాఖ ఆద్వర్యంలో పతాంజలి యోగా వారి సహకారం తో జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా యోగా ట్రైనర్స్ పోలీసు అధికారులు, సిబ్బందితో యోగా ఆసనాలు, ధ్యానం, శ్వాస పైన ధ్యాస, సూర్య నమస్కారాలు, ప్రాణాయామము, తదితర ఆసనాలు చేయించడం జరిగిందనీ తెలియజేస్తూ జిల్లా ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఆరోగ్యంగా ఉంటూ ఆనందమైన జీవితానికి యోగా ఉపయోగపడుతుందని, వేల సంవత్సరాల నుండి యోగా భారత దేశ సంస్కృతిలో బాగంగా ఉండడం మనకు దక్కిన గొప్ప గౌరవం అని, ప్రపంచ దేశాలు యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రత్యేక గుర్తింపును ఇచ్చాయని అన్నారు. చేసే పని పై శ్రద్ధ పెరుగుటకు, మనసు ప్రశాంతంగా ఉంచుకొనుటకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని , ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉండే వారికి యోగా అంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరు యోగాను నిజ జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. అనంతరం జూన్ 26 మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని, రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహించనున్న వారోత్సవాలను విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరూ డ్రగ్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, యువతని అటు వైపు వెళ్లకుండా చైతన్యం చేయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్పీ వై మొగిలయ్య, సాయుధ దళ డి.ఎస్పీ నరేందర్ రావు, కార్యాలయ ఏ.ఓ సతీష్ కుమార్, ఎస్బి. ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, గద్వాల్, ఆలంపూర్, శాంతి నగర్ సి ఐ లు టంగుటూరు శ్రీను, రవి బాబు, టాటా బాబు, అర్ ఐ వెంకటేష్, ఎస్సై లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో నిరుపేద ప్రజలకు సంక్షేమ ఫలాలు

### ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### త్వరలోనే కార్పొరేటర్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ గురుకుల పాఠశాల



ఇందిరమ్మ ఇండ్ల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 21(ప్రభాత ఉదయం) ప్రజాపాలన లో నిరుపేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం గద్వాల నియోజకవర్గం లో కె.టి దొడ్డి మండల కేంద్రము లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన వారికి అర్హులైన ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి,కి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ....గతంలో ఈ ప్రాంతంలోని ప్రజలు వలసలుగా వెళ్లేవారు కానీ నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి మీ ప్రాంతంలోని ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేయడం జరిగింది ఈ ప్రభుత్వాలు వచ్చిన ప్రభుత్వం తో వప్పించి ప్రభుత్వం నుండి నిధులను తీసుకొచ్చి ఈ ప్రాంత అభివృద్ధి కొరకు సాయి శక్తుల చేయడం జరిగినది తెలిపారు. ఇప్పుడిప్పుడే కె.టి దొడ్డి మండలం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీ లో భాగంగా ఇప్పటికే రెండు గ్యారెంటీ లను పూర్తి చేయడం జరిగింది. మహిళా ఫ్రీ, 500 రూపాయల సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతులకు రైతు రుణమాఫీ రైతు బంధు, రేషన్ కార్డులు, సన్న బియ్యం అందించడం జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు సొంత ఇంటి లేక కూలి గుడిసెలో నివసిస్తున్న వారికి ప్రభుత్వము ఐదు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఇందిరమ్మ ఇల్లు ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లును కట్టించి ప్రతి ఒక్క పేద ప్రజల సొంతింటి కలను ఇందిరమ్మ ఇల్లు తోనే సాధ్యమవుతుందని తెలిపారు. గద్వాల నియోజకవర్గ లో మొదటి విడతగా 3500 ఇండ్లు మంజూరు కావడం జరిగింది . ఇందులో కె.టి దొడ్డి మండలానికి 378 ఇండ్లను కేటాయించడంతో ఇల్లు లేని పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చు కోడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి ప్రభుత్వము కృషి చేయడం జరుగుతుంది. ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా సాయ శక్తుల కృషి చేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని గురుకుల పాఠశాలలో 5000 మంది విద్యార్థులు చదువుకునే విధంగా నూతన గురుకుల పాఠశాల నిర్మాణ పనులను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కె.టి దొడ్డి మండల అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేయడం జరుగుతుంది తెలిపారు. ఎవరు కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. గద్వాల నియోజకవర్గం లో నన్ను రెండోసారి గెలిపించి అవకాశం కల్పించిన ప్రజల కోసం నేను ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం జరిగింది. గద్వాల నియోజకవర్గ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు మాజీ ఎంపీపీ విజయ్, జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి , వెంకటేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, నాయకులు ఉరుకుందు శేఖర్ రెడ్డి , చంద్రశేఖర్, యుగంధర్ గౌడ్, వెంకన్న గౌడ్, నవీన్ రెడ్డి, ఆంజనేయులు, తిమ్మప్ప , రాజేష్, హరిప్రసాద్ గౌడ్, గోపాల్ రెడ్డి, తిమ్మారెడ్డి, తిక్కన , భీమ రాయుడు, నర్సింహులు , కృష్ణ , శేఖర్ రెడ్డి, ఆంజనేయులు , అమరేష్ , గోపాల్ రెడ్డి, గోపి రంగారెడ్డి, భగవంతు, వెంకటేష్ గౌడ్, సురేష్ నాయక్ శేఖర్, నాసిర్ , ఖాజా, పవన్ రెడ్డి, జానీ, వెంకటేష్, ఖాసీం వీరేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒకరు ఆరోగ్యంగా జీవించాలంటే యోగాను ప్రతిరోజు ఆచరించాలి

### యోగా ద్వారా మనసుకు శరీరానికి ప్రశాంతత లభిస్తుంది

### మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్



కూకట్‌పల్లి, జూన్ 21 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్ కేఎన్ఆర్ గార్డెన్స్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగాసనాలు నిర్వహించబడిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని యోగాభ్యాసంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ,"యోగ మన భారతీయ సంప్రదాయానికి చిరునామా. ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి ఒక్కరూ యోగాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. యోగ ద్వార శరీరానికి చురుకుదనం, మనస్సుకు ప్రశాంతత కలుగుతుంది. యువత, పెద్దలు అందరూ యోగానికి ప్రాధాన్యత ఇవ్వాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, యువ మోర్చా నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు, పలు కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్

### ఉద్యమపాఠాలు నేర్పిన మహోపాధ్యాయుడు, జీవితమంతా తెలంగాణ కోసమే బతికిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్

### ఆచార్య జయశంకర్ చూపిన మార్గం, ఉద్యమ పాఠాలు, చైతన్యం యావత్తు తెలంగాణ సమాజం గుండెల్లో చిరస్మరణీయం: టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి, జూన్ 21 (ప్రభాత ఉదయం) స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంత కర్త, స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా మూసాపేట్ లోని ఆంజనేయ నగర్ చౌరస్తాలో బీసీ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు భాశెట్టి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం హాజరై జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ చీకట్లు కమ్మిన తెలంగాణాలో ప్రత్యేక ఉద్యమాన్ని ప్రజ్వలింప చేసిన జ్వాల. ఆసమానతల సమాఖ్య రాష్టం నుంచి తెలంగాణకు న్యాయం కోసం కొట్లాడిన గొంతు. ఐదు దశాబ్దాలుగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మార్గ దర్శనం చేసిన ధ్రువతార. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసిన ఆజన్మ బ్రహ్మచారి అని అన్నారు. తెలంగాణ కోసం రాజకీయ పక్రియ అనివార్యమని ప్రగాడంగా విశ్వసించారు. కానీ దాని ద్వారానే ప్రత్యేక తెలంగాణ సాధ్యం కాదని జీవితమంతా బోధించారు. తెలంగాణ భావజాలాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసారు. ' మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసన దశకు తెలంగాణ రావాలి. మా తెలంగాణ మాగ్గావాలి ' అంటూ పోరాటం, అవగాహనా, రాజకీయ పక్రియ, ఈ మూడు ఏకకాలంలో జరగాలని, ఆ దిశగా నిత్యం తెలంగాణ ప్రజల్లో చైతన్య దివిటీని వెలిగించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, తెలంగాణ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ తూము వినయ్ కుమార్, టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు సప్పిడి భాస్కర్, బిసి ఐక్యవేదిక నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608